


ప్రమాద ఘంటికలు



ఉమ్మడి జిల్లాలో అధఃపాతాళానికి భూగర్భ జలాలు

- పల్లెలు, పట్టణాలు అన్ని చోట్లా తీవ్రమవుతున్న నీటి ఎద్దడి
- శరవేగంగా పడిపోతున్న నీటి మట్టాలు
- అనేక మండలాల్లో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులు
- వికారాబాద్‌లో సగటు 12.93 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు.. ఎండుతున్న బోర్లు
- రంగారెడ్డిలో 12.57 మీటర్లు, మేడ్చల్‌లో 12.45 మీటర్ల లోతున నీరు
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 36.25 మీటర్లకు పడిపోయిన భూగర్భ జల మట్టాలు
- మే నెలలో మరింత గడ్డు పరిస్థితే!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ నీటి మట్టాలు ప్రజలకు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. గత వానాకాలంలో సాధారణం కంటే కొంత అధిక వర్షపాతమే నమోదైనా ఈ వేసవిలో చినుకైనా రాలలేదు. పంటలకు, తాగునీటికి, వాడకానికి ఎక్కువ మొత్తంలో భూగర్భ జలాన్నే వినియోగిస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచే జిల్లాలో నీటి ఎద్దడి మొదలైంది. ఏప్రిల్, మే, జూన్‌లలో పరిస్థితి జఠిలంగా మారనుంది. ఇప్పటికే బోర్లు నీరు పోయక పంటలెండుతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరాలోనూ అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని గ్రామాలు, తండాల్లో వ్యవసాయ బోర్ల నీటిని తెచ్చుకుంటున్నారు. మూడు జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు భారీగా పడిపోయాయి. జనసాంద్రత ఎక్కువ ఉన్న శేరిలింగంపల్లి వంటి మండలాల్లో నీటి మట్టాలు వేగంగా తరిగిపోతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఇక్కడ 36.25 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఏప్రిల్ ఆరంభం నుంచే అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నగర శివార్లలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భూగర్భ జలాలు అడుగంటి అనేక ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతం తేడా లేకుండా అనేక మండలాల్లో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాలుస్తోంది. ఈ ఎండ కాలంలో ఎక్కడా అకాల వర్షాలు పడకపోవడంతో అనేక చోట్ల తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. తాగు నీటి ఎద్దడితో పాటు సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బోర్లు, చెరువులు వట్టిపోతూ అనేక చోట్ల పంటలు కూడా ఎండిపోతున్నాయి. నగర శివార్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మార్చి నెలాఖరు నాటికి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలంలో భూగర్భ జలాలు అధఃపాతాళానికి పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడ 36.25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో సగటు భూగర్భ జలాలు 12.57 మీటర్ల మేర పడిపోవడం గమనార్హం. ఏప్రిల్ ఆరంభం నాటికి ఇలాంటి పరిస్థితి కొన్నేళ్లలో ఎప్పుడూ రాలేదు. ఎండలు తీవ్రంగా ఉండే మే నెలలో నీటి ఎద్దడి గురించి ఆలోచిస్తే మరింత దారుణంగా మారే పరిస్థితే కన్పిస్తోంది. నగర శివారుల్లోని అనేక మండలాల్లో తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. మెట్రో వాటర్ బోర్డు కూడా డిమాండ్ సరిపడా తాగునీరు సరఫరా చేయలేకపోతోంది. నీటి ట్యాంకర్ బుక్ చేస్తే నాలుగైదు రోజులకు కూడా రావడం లేదు. మిషన్ భగీరథ ద్వారా కూడా గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే తాగు నీటి సరఫరా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో గత వానకాలంలో సాధారణానికి మించి భారీగా వర్షపాతం నమోదైనా ఎండకాలం సమయంలో కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతో వాడకం ఎక్కువై భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. ఈ ఏడాది వేసవిలో గతం కంటే ముందుగానే నీటి ఎద్దడి మొదలైంది. కొన్ని మండలాల్లో సగటు వర్షపాతం నమోదైనా విచ్చలవిడి నీటి వాడకం వల్ల శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ వేసవిలో నీటి ఎద్దడి మరింత తీవ్రం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత వానకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో వర్షాలు సగటుకు మించి కురిసినా యాసంగిలో కనీస స్థాయిలో కూడా వానలు పడలేదు.

వానకాలంలో వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సగటు కంటే 29 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా రంగారెడ్డి జిల్లాలో 19 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. అయితే ఈ యాసంగిలో ఎక్కడా వర్షాల జాడేలేదు. ఈశాన్య రుతుపవనాలు ఏమాత్రం ప్రభావం చూపలేదు. యాసంగిలో రంగారెడి జిల్లాతో పాటు మేడ్చల్ జిల్లాలో 82 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లాల్లో 80 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి.

పలు మండలాల్లో గణనీయంగా నీటి మట్టాల తరుగుదల

రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు గతంలో ఎన్నడూ లేని విధంగా పడిపోయాయి. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నీటి మట్టాలు లోతుకు పోతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లి మండలంలో 36.25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అలాగే ఇబ్రహీంపట్నంలో 20.42 మీటర్లు, తలకొండపల్లి 18.21 మీటర్లు, హయత్‌నగర్‌లో 17.81మీటర్లు, చౌదరిగూడెంలో 16.76 మీటర్లు, కడ్తాల్‌లో 14.36 మీటర్ల మే నీటి మట్టాలు తగ్గాయి. షాబాద్‌లో 13.95 మీటర్లు, మంచాల 13.8 మీటర్లు, శంకరపల్లిలో 13.12 మీటర్లు, చేవెళ్లలో 12.66 మీటర్లు, కొత్తూరులో 12.61 మీటర్లు, మహేశ్వరం మండలంలో 12.72 మీటర్ల లోతులకు భూగర్భ జల మట్టాలు పడిపోయాయి.

ఒక్క నెలలో 16.6 మీటర్ల మేర నీటి మట్టాల పతనం

గత ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చి నెలలోనే అనేక మండలాల్లో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటాయి. శేరిలింగంపల్లిలో గడిచిన 2024 మార్చిలో 16.6 మీటర్లు భూగర్భ నీటి నిల్వలు తగ్గిపోవడం గమనార్హం. అలాగే మార్చిలో ఇబ్రహీంపట్నం మండలంలో 9.78 మీటర్లు, మంచాలలో 7.41 మీటర్లు, హయత్‌నగర్‌లో 6.62 మీటర్లు, తలకొండపల్లిలో 6.61 మీటర్లు, చౌదరిగూడలో 5.39 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి.

మేడ్చల్ జిల్లాలోని అన్ని మండలాల్లో పడిపోయిన నీటి మట్టాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ తరిగిపోతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యతో ట్యాంకర్ల నీటిని తెప్పించుకుంటున్నారు. గతేడాది ఇదే సమయంలో 9.5 మీటర్ల లోతున ఉన్న నీరు ఇప్పుడు 12.45 మీటర్లకు పడిపోయింది. కూకట్‌పల్లి మండలంలో 22.74మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. అల్వాల్‌లో 9.96, బాచుపల్లిలో 6.66, బాలానగర్‌లో 9.77 మీటర్లు, దుండిగల్‌లో 16.35, ఘట్‌కేసర్‌లో 8.56 మీటర్లు, కాప్రాలో 4.81 మీటర్లు, కీసరలో 10.24 మీటర్లు, మూడూచింతలపల్లిలో 18.13 మీటర్లు, మల్కాజిగిరిలో 16.58 మీటర్లు, మేడ్చల్‌లో 10.02 మీటర్లు, మేడిపల్లిలో 16.72 మీటర్లు, కుత్బుల్లాపూర్‌లో 11.93 మీటర్లు, శామీర్‌పేటలో 7.31, ఉప్పల్‌లో 13.85 మీటర్ల చొప్పున నీటి మట్టాలు పడిపోయాయి.

2024 ఫిబ్రవరితో పోలిస్తే భూగర్భ జల మట్టాల వ్యత్యాసం

రంగారెడ్డి	- 3.68
మేడ్చల్	- 2.95
వికారాబాద్	- 0.55

గత రెండు నెలల్లో జిల్లాల్లో భూగర్భ జల మట్టాల పరిస్థితి (మీటర్లలో)

జిల్లా	ఫిబ్రవరి	మార్చి
రంగారెడ్డి	11.59	12.57
మేడ్చల్	11.45	12.45
వికారాబాద్	13.07	12.93

రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభ్యున్నతికి పాటుపడాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 : భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభ్యున్నతికి పాటుపడాలని కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి రాజ్యాంగ బద్ధంగా హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అన్ని మతాల వారు సమానంగా అభివృద్ధి చెందాలని అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీఆర్.అంబేడ్కర్ గురించి రెండు నిమిషాల్లో గాని రెండు వ్యాక్యాల్లో గానీ చెప్పే అంత చిన్న విషయం కాదన్నారు. మనం ఇన్నేళ్లుగా అంబేడ్కర్ గురించి చదువుతూనే ఉన్నాం, వింటూనే ఉన్నాం, స్మరించుకుంటునే ఉన్నామని చెప్పారు. విద్యార్థులైనా, పెద్దవారైనా అంబేడ్కర్ జీవిత చరిత్రలోని ఒక పేజీని మన జీవితంలో పాటించడం చేస్తే గొప్ప సేవ చేసిన వాళ్లమవుతామన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు సమానత్వం, సౌభ్రాతృత్వం కల్పించారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఆధారంగానే నేడు అందరికీ హక్కులు, ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రమీలరాణి, సోషల్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్‌లో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

- హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

శంషాబాద్, ఏప్రిల్ 14 : శంషాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం బీఆర్.అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు డాక్టర్ ప్రేంరాజ్ హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం ఫ్లై ఓవర్ కింద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కొంత దూరం పక్కకు జరిపితే ఏవైనా కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు కలుగుతుందని, ఆ మేరకు మార్పు చేసేలా అధికారులకు సూచించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు స్పీకర్‌ను కోరారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుందాం అని స్పీకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన డీసీసీ నాయకురాలు ఫైలారం సులోచన, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, చిట్టిబాబు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు పాటించాలి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 : అగ్ని ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు తప్పక పాటించాలని కలెక్టర్ శశాంక అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహనపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతో కూడిన ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. గోదాములు, షాపింగ్ మాళ్లు, పాఠశాలు, సినిమా థియేటర్లు, ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా యజమానులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారులు పూర్ణచంద్రరావు, శ్రీనాథ్, పి.నాగేశ్వరరావు, చంద్రనాయక్, జగన్ బలరాం, పి.రాకేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం



సురంగల్‌లో మల్లికార్జున స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న భక్తులు



మొయినాబాద్, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం కమణీయం రమణీయంగా జరిగింది. అంతకు ముందు గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో మూడు రోజులుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మహిళలు ఎండను సైతం లెక్కచేయకుండా బోనాలు ఎత్తుకొని స్వామి వారికి సమర్పించారు. బీర్లోళ్ల డోలు వాయిద్యాలు, ఆట పాటల మధ్య బోనాలను ఊరేగించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు లావణ్య, రాంచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ అంజిరెడ్డి, మల్లేశ్, నాయకులు ఎట్టయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రభుయాదవ్, రాజుయాదవ్, జనార్ధన్‌రెడ్డి, మల్లేశ్, శేఖర్, భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా బుగ్గ రామేశ్వరస్వామి రథోత్సవం



షాబాద్, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి రథోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొమరబండ నుంచి బుగ్గరామేశ్వర స్వామి ఆలయం వరకు భక్తులు చెక్క భజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తూ కోలాహలంగా ఆటలాడుతూ, పాటలు పాడుకుంటూ రథోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాలకు గ్రామస్తులతో పాటు మండల ప్రజలు తరలివచ్చారు.

◄ కొమరబండలో రామేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

కాసులు కురిపిస్తున్న 'నిమ్మ'

- మార్కెట్లో నిమ్మకాయలకు భారీ డిమాండ్!
- తోటల వద్దే చిరు వ్యాపారులు కిలో రూ.150కి చొప్పున కొనుగోలు
- మార్కెట్‌లో కిలో రూ.250 వరకు అమ్మకం
- తక్కువ పెట్టుబడితో రైతులకు మేలు
- ఒక్కసారి నాటితే 20 ఏళ్ల దాకా దిగుబడి





మర్పల్లి మండలం తుమ్మల్‌పల్లిలో తోటలో నిమ్మకాయలు తెంపుతున్న రైతు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/మర్పల్లి): నిమ్మ సాగు ఎండ కాలంలో రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. మార్కెట్‌లో నిమ్మకాయలకు డిమాండ్ పెరగడం నిమ్మ రైతులకు కలిసొచ్చింది. మార్కెట్‌లో నిమ్మకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్క నియ్మకాయ రూ.10 నుంచి 12 రూపాయలు ఉంది. ఈ డిమాండ్‌తో వ్యాపారులు నేరుగా నిమ్మ తోటల వద్దకు వెళ్లి కాయలు కొంటున్నారు. చిరు వ్యాపారులకు రైతులు కిలో రూ.120 నుంచి 150 అమ్ముతున్నారు. మార్కెట్‌లో కిలో రూ.200 నుంచి రూ.250కు అమ్ముతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యి ఎకరాల్లో నిమ్మ తోటలు సాగవుతున్నాయి. గతంలో నిమ్మసాగు విస్తీర్ణం దీనికి రెట్టింపు విస్తీర్ణంలో ఉండేది. కానీ కొవిడ్ సమయంలో రెండేళ్లు రైతులకు గిట్టుబాటు ధర లభించలేదు. తరువాత ఏడాది కూడా నిమ్మకాయ ధర అంతంతే ఉంది. రైతులు నిమ్మ తోటలు నరికి ప్రత్యామ్నాయ పంటలు వేశారు. దీంతో జిల్లాలో నిమ్మసాగు తగ్గింది. అయితే ఈ ఏడాది నిమ్మకాయలకు డిమాండ్ పెరిగింది. దేశవ్యాప్తంగా కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉండడంతో ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. వాస్తవానికి నిమ్మసాగులో మొక్కలు నాటిన రెండేళ్ల పాటు తప్పా తరువాత పెద్దగా ఖర్చు ఉండదు. ఒక్కసారి మొక్కనాటితే 20ఏళ్ల వరకు దిగుబడులు వస్తాయి. నిమ్మ చెట్లు ఏడాదికి రెండు సార్లు కాయలు/పండ్ల దిగుబడి ఇస్తాయి. ఎకరానికి సగటున 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఎకరానికి వానకాలంలో 2టన్నులు, వేసవిలో 2టన్నుల చొప్పున కాయలు వస్తాయి.

నిమ్మ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

నిమ్మ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఉపాధి హామీ పథకంతో పాటు పీఎంకేఎస్‌వై పథకాల కింద ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట వేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతులకు 100శాతం సబ్సిడీతో మొక్కలు, బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది. నిమ్మతోట సంరక్షణ బాధ్యతను నాలుగేళ్ల పాటు ప్రభుత్వమే చూసేలా ఏర్పాటు చేసింది. మొక్కలు నాటే సమయంలో ఒక్కో మొక్కకు రూ.25 చొప్పున రైతులకు చెల్లిస్తుంది. అలాగే ఎరువుల కోసం రూ.50 చొప్పున, నిర్వహణ ఖర్చు కింద రూ.10 చొప్పున ప్రతి ఏటా రైతుల బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం డబ్బు వేస్తుంది.

ఎకరానికి యేటా 4 టన్నుల దిగుబడి



ఈ రైతు పేరు శ్యాంరావు. గ్రామం తుమ్మల్‌పల్లి, మర్పల్లి మండలం. ఈయనకు 8ఎకరాల నిమ్మ తోట ఉంది. ఎనిమిదేళ్ల కింద నిమ్మ తోట నాటారు. ఏడాదికి రెండు సార్లు దిగుబడి వస్తోంది. మొత్తం విస్తీర్ణంలో 30 నుంచి 32 టన్నుల వరకు నిమ్మ పంట చేతికి వస్తోంది. వేసవిలో 16 టన్నులు, వానకాలంలో 14 నుంచి 16టన్నుల వరకు పంట చేతికొస్తోంది. వేసవిలో నిమ్మ కాయలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. వానకాలంలో నిమ్మ కాయలను పరిసర ప్రాంతాల దాబాల యజమానులు కొనుగోలు చేస్తుంటారు.హైదరాబాద్ మార్కెట్లలో కిలో రూ.100 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. చిరు వ్యాపారులు మార్కెట్లో వినియోగదారులకు కిలో నిమ్మ రూ.200 నుంచి రూ.250లకు విక్రయిస్తున్నారు. తోట ప్రారంభించినప్పుడు మొక్కలు, ఎరువులు, డ్రిప్ వంటి వాటికి ఎకరానికి రూ.50వేల ఖర్చు వచ్చిందని శ్యాంరావు చెప్పారు. నిమ్మకాయలు తెంపేందుకు ఏడాది పాటు ఇద్దరు కూలీలను నియమించారు. నెలలో 15 నుంచి 20రోజుల పాటు నిమ్మ కాయలు తెంపుతారు, ఏడాదిలో ప్రతీ చెట్టు రెండు కాతలు కాస్తాయి. కాతకు కాతకు మధ్య నెల రోజుల వ్యత్యాసం ఉంటుంది.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు : డీసీపీ సునీతారెడ్డి

ఆదిభట్ల, ఏప్రిల్ 14 : సీసీ కెమెరాల ఏర్పాటుతో నిరంతర పర్యవేక్షణ ఏర్పడి నేరాలను అదుపులో ఉంచేందుకు అవకాశం ఉంటుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీలో కాలనీ వాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆదివారం డీసీపీ ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులతో ఆమె మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు వారి పూర్తి సమాచారం తెలుసుకోవాలని, ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసులు నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తారని, గొడవలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని, చిన్న సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తేవాలని అన్నారు. అత్యవసర సమయంలో డైల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు, ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు రాజు, గ్రీన్ హోమ్స్ కాలనీ అధ్యక్షుడు పాండురంగస్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీసి సునీతారెడ్డి



నేడు బీజేపీ ప్రజా ఆశీర్వాద సభ

వికారాబాద్, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్ పట్టణంలో ప్రజాఆశీర్వాద సభ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో ఈ సభ ఉంటుందని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈసభకు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు మాదవ రెడ్డి హాజరవుతారన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటనను జయప్రదం చేయాలి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కోస్గిలో మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం బొంరాస్‌పేట్, దుద్యాల మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు, సింగిల్ విండో చైర్మన్‌లు, రైతు సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, చాంద్‌పాష, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 14 : అంతర్జాతీయ కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 షొటోకాన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు మాస్టర్ ఆర్ట్స్‌లో నిర్వహించిన పోటీలో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు మాస్టర్ సాయికుమా ర్ అభినందించారు.





















చల్లని నీడ.. పచ్చని పూలు

కేశంపేట మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వెళ్లే రహదారిలో పచ్చని చెట్లు ఎండవేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయి. చెట్లకు పూసిన పసుపు వర్ణ పూలు వాహనదారులకు స్వాగతం పలుకుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. వేముల్‌నర్వ గ్రామ సమీపంలో రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లు ఏపుగా పెరిగి పసుపు రంగులో పూలు పూశాయి. ఈ మార్గంలో వెళ్లేవారు ఎండవేడిమి తట్టుకోలేక కొద్దిసేపు వాటి కింద సేదతీరుతున్నారు. పసుపు పూలతో రోడ్డుకు శోభ సంతరించుకుంది.

- కేశంపేట, ఏప్రిల్ 14

బ్యాక్‌వాటర్.. భళే కనువిందు

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని బషీరాబాద్ మండలం క్యాద్గీరా-కర్ణాటక ప్రాంతం జెట్టూరు మధ్యన కాగ్నానదిపై బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించారు. దాంతో నది బ్యాక్‌వాటర్‌తో కనుచూపు మేర జలకళ సంతరించుకుంది. నీరు, పరిసర ప్రాంతం చూడటానికి రెండు కళ్లు చాలవన్నట్లు చూపరులకు కనువిందు చేస్తోంది. అటుగా వెళ్లేవారు కొద్దిసేపు ఆగి ఆ సుందర దృశ్యాన్ని చూసి మంత్రముగ్ధులవుతున్నారు. కాగా, ఈ బ్రిడ్జిని కర్ణాటక ప్రభుత్వం నిర్మించినప్పటికీ రెండు రాష్ట్రాల నదీ పరివాహక ప్రాంత రైతులకు సాగు నీటికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

- బషీరాబాద్, ఏప్రిల్ 14



నా గెలుపును ఎవరూ ఆపలేరు

- మూడోసారీ నరేంద్ర మోదీనే ప్రధాని
- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల, ఏప్రిల్ 14: చేవెళ్లలో తన గెలుపును ఎవరూ ఆపలేరని, కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపడతారని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం యాలాల మండల పరిధిలోని కోకట్ రోడ్డు మార్గంలో గల వెంకోబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించగా.. విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ఎన్నిక కావడం ఖాయమన్నారు. ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై నిందలు మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోరాదని సూచించారు. లాక్‌డౌన్ కాలం నుంచి ఇప్పటివరకు ప్రతీ కుటుంబానికి ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఘనత నరేంద్ర మోదీకే దక్కిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీల నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోకుండా.. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. చేవెళ్ల నుంచి తాను ఎంపీ అభ్యర్థిగా నిలబడినందున ప్రతీ ఒక్కరు గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. యువకులు గ్రామాల్లో ప్రజలందరూ బీజేపీకి ఓటువేసేలా చైతన్యపర్చాలని కోరారు. కార్యక్రమంలో యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ మండలాధ్యక్షుడు యాదగిరి, రమ్య నాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సిములు, ఉప్పరి రమేష్, తాండూరుతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యాలాల : మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అంబేడ్కర్ నిజమైన ప్రజా నాయకుడు : కొండా

రాజేంద్రనగర్ : అంబేడ్కర్ నిజమైన ప్రజా నాయకుడని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు అధ్యక్షతన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గం ప్రజలందరికీ ఆచరణీయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి కొంతమంది స్వార్థపూరిత నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామంటూ తమ సంకుచిత బుద్ధిని బయట పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు సరైన గౌరవం ఇవ్వకుండా ఆయన ఆశయాలను విస్మరించిందన్నారు.

నార్సింగ్‌లో సంగీతారెడ్డి ప్రచారం

నార్సింగ్/రాయదుర్గం : విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గంతో పాటు గచ్చిబౌలి అపర్ణ సైబర్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం నార్సింగ్ మున్సిపాలిటీలోని మైహోమ్ అవతార్, విజిలింగ్ వుడ్స్ గేటెడ్ కమ్యూనిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, మోదీ సంక్షేమ విధానాలతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని, ప్రతీఒక్కరు కొండా గెలుపునకు కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రతీఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

సర్వేలన్నీ బీజేపీకే అనుకూలం

మొయినాబాద్ : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో సర్వేలన్నీ బీజేపీకే అనుకులంగా ఉన్నాయని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం కనమామిడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల మద్దతు బీజేపీకే ఉందన్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా మోదీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పేదలకు ఉచిత కరెంటు ఇచ్చేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పని చేస్తుందని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఠాకూర్ గార్డెన్‌లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ, తదితర విషయాలపై వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.



రాజేంద్రనగర్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

కొత్తూర్, ఏప్రిల్ 14 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వాగ్దానాలకు ప్రజలు మోసపోయి.. ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పావిరస్‌పోర్టు రిసార్టులో ఆదివారం కొత్తూర్, కొత్తూర్ మున్సిపాలిటీ, నందిగామ మండలాల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సన్నాహక సమావేశానికి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, షాద్‌నగర్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వై.అంజయ్యయాదవ్, లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యారని దుయ్యబట్టారు. జడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, నాయకులు వి.నారాయణరెడ్డి, రాజావరప్రసాద్, రాంబాల్‌నాయక్, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

లింగ బలిజల అభివృద్ధికి తోడ్పాటు : ఎమ్మెల్యే కసిరెడ్డి

- జిల్లా లింగ బలిజ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కడ్తాల్, ఏప్రిల్ 14 : లింగ బలిజల అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు కడ్తాల మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడు మిర్యాణం అనికుల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కడ్తాల మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్‌ల భవన ఏర్పాటుకు తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, ఈశ్వరప్పలు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ లింగబలిజల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తోడ్పాటునందించాలన్నారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ లింగబలిజల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర కమిటీ సభ్యుడు శివ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేశ్ పాటిల్, కోశాధికారి రాజప్ప, యువజన విభాగం అధ్యక్షుడు భరత్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శిరశరణ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆనందప్ప, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి సురేశ్, తదితరులున్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కార్యకర్తల కృషితోనే అధికారంలోకి..



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 14 : పార్టీ కార్యకర్తల కష్ట ఫలితంగానే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకొని దేశంలో కూడా అధికారాన్ని చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌లు అన్నారు. ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడలో నిర్వహించిన విజయభేరి సభతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అదే తరహాలో మొన్న తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభతో కేంద్రంలో కూడా అధికారంలోకి రాబోతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 15 ఎంపీ సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందన్నారు. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తామని, వాటి ద్వారానే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాల్సి ఉంటుందన్నారు. పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునిత అంద్యానాయక్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, సీనియర్ నాయకుడు యాదయ్య, మాజీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌ముదిరాజ్, రఘుపతి, రాఘవేందర్‌రెడ్డి, ఇస్రాయేలు, హరికిషన్‌గౌడ్, మురళీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఐ.నర్సింహ, నయూమ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కుమార్ ముదిరాజ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 14 : సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఘట్‌కేసర్ మండల పరిధిలోని వెంకటాపూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నీరుడి కుమార్ ముదిరాజ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు ఆదివారం సీఎం నివాసంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కుమార్‌ముదిరాజ్‌కు రేవంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 14 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, స్థానిక నాయకులతో కలసి రంజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని అన్నారు. నాయకులకు అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పీఏసీఎస్ చైర్మన్లు ఐసపదేవర వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్‌లు మధుసూన్‌గుప్తా, బండారు శైలజాఆగిరెడ్డి, ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

పరిగి/యాలాల : కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్‌లో చేరానని రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలో ర్యాలీ నిర్వహించి, మిట్టకోడూరులో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. చేవెళ్ల నుంచి మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా ఏం ముఖం పెట్టుకుని ప్రజలను ఓటు అడుగుతారని ప్రశ్నించారు. ఐదేళ్లలో ప్రజలకు కనిపించకుండా పోయారని, కలవడానికి వెళ్ళిన వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని కొండాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల సభలో కేసీఆర్ రంజిత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రంజిత్‌రెడ్డి పార్టీలు మారారని విమర్శలు చేశారని, అదే కేసీఆర్ కాంగ్రెస్, టీడీపీలు మారి, బీఆర్ఎస్ పెట్టారని, కాసాని జ్ఞానేశ్వర్ ఎన్ని పార్టీలు మారారని, ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఎలా పొందారో కేసీఆరే చెప్పాలన్నారు. పాలమూరు, చేవెళ్ళ ప్రాణహిత ప్రాజెక్టులు కట్టకుండా ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేసీఆర్.. ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రంజిత్‌కు పరిగి నుంచి 50 వేల మెజార్టీని ఇస్తామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ఆనందం, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, మండలాధ్యక్షుడు పరశరాంరెడ్డి, పట్టణాధ్యక్షుడు కృష్ణ, తదితరులున్నారు.



చేవెళ్ల : కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి



పరిగి : బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

భారీ ఎత్తున రంజిత్‌రెడ్డి బైక్ ర్యాలీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పూడూరు మండలం రాకంచర్ల నుంచి పరిగి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బైక్‌పై రంజిత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. పట్టణంలో జీపుపై నిర్వహించిన ప్రచారంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు వారికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. అదేవిధంగా యాలాల మండల కేంద్రంలో కాంగ్రెస్ బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. బుయ్యని శివారెడ్డి, కౌశిక్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కోఆప్షన్ అధ్యక్షుడు అక్బర్ బాబా, జోషి గురురాజ్, జెక్కేపల్లి మహిపాల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షులు మొహిజ్, శ్రీనివాస్ (చిన్న), తదితరులున్నారు.

నిరంతరం అండగా ఉంటా

రాజేంద్రనగర్ : నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు అధ్యక్షతన ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో రంజిత్‌రెడ్డి పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లోని దళిత వర్గాలకు నిరంతరం అండగా ఉంటానని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. దేశంలో అన్ని వర్గాలకు అండగా ఉండేది కాంగ్రెస్సేనని అన్నారు.



రాజేంద్రనగర్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి, నాయకులు

కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలి : రంజిత్‌రెడ్డి

గచ్చిబౌలి : కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా నేరవేరుస్తుందని రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌ను కలిసి ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. శేరిలింగంపల్లి అభివృద్ధిలో తనవంతు సహకారం ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లి తారానగర్, పాపిరెడ్డికాలనీలో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి ఓటర్లను కలిసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



పరిగి : రంజిత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

● జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

● నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 14 : అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే యాదయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం తోపాటు వివిధ సంఘాలు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమని అన్నారు. ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మెన్లు, మాజీ సర్పంచ్‌లు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు. శంకర్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, మున్సిపాలిటీలో అంబేడ్కర్ జయవంతి వేడుకలను వివిధ పార్టీల నేతలు ఘనంగా నిర్వహించారు.

మొయినాబాద్ : మండలంలో అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆల్ ఇండియా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేగరి రాజుతోపాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్, ప్రజా సంఘాల నాయులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : అసమానతలు లేని నవ సమాజ నిర్మాణం కోసం అందరు కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు నాయకులు, పాల్గొన్నారు.

తలకొండపల్లి : తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాచారం : మండల పరిధిలో ప్రజా సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. యాచారం, గున్‌గల్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటిచంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహా పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లర్పించాయి. సమ సమాజ నిర్మాణం కోసం అంబేడ్కర్ చేసిన సేవలను ప్రజలు ఏనాడూ మరువరని ఎమ్మెల్యే రంగారెడ్డి కొనియాడారు. కాగా వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్లు కప్పరి స్రవంతి, మర్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.


చేవెళ్లలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కేశంపేట : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులు గూడ వీరేశ్, రొల్ల రాఘురాములుగౌడ్, మురళీధర్ రెడ్డిలు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాడ్గుల : మాడ్గుల మండల కేంద్రంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడకల్లో ఆయన విగ్రహానికి ఎస్సై ఉపేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొడ్లపహాడ్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని విగ్రహదాత కంబాలపల్ల లక్ష్మయ్య ఆవిష్కరించారు. నాగిళ్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందిగామ మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహేశ్వరం : అంబేడ్కర్ జయంతి సందర్భంగా మహేశ్వరంలో అంబేడ్కర్ విగ్రహానికి టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కందుకూరు : అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి వేడుకలు జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఎమ్మార్వో కె.గోపాల్ అంబేడ్కర్ చిత్రటానికి పూలమాల వేశారు. పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు అంబేడ్కర్ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి వేడుకలను జరుపుకున్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : అంబేడ్కర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్‌లో ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు షాద్‌నగర్ చౌరస్తాతో పాటు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎల్లనమోని అంజయ్యయాదవ్, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింహులు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మనుధర్మశాస్త్రాన్ని ప్రోత్సహిస్తూ, రాజ్యాంగాన్ని మార్చాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని చెప్పారు.

కొత్తూర్, : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మున్సిపాలిటీతో పాటు, వివిధ గ్రామాల్లో అయన విగ్రహాలతో పాటు, చిత్రపటాలకు పార్టీలకు అతీతంగా ఆయా పార్టీల నాయకులు పాల్గొన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీతో పాటు, మండలంలోని పెంజర్లలో గ్రామంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలంలో ఎంపీపీ పి. మధుసూదన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేని నివాళులర్పిచారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా షాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశమోళ్ల అంజనేయులు, సమతా సైనిక్‌దళ్ మండల అధ్యక్షుడు దేశమోళ్ల కృష్ణ, బీసీసెల్ జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంచాల : బారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేడ్కర్ జయంతిని మంచాల మండల పరిదిలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వివిద పార్టీలు, సంఘాలకు చెందిన నేతలు ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొందుర్గు : అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షాద్‌నగర్‌రూరల్ : షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంబేడ్కర్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి మొయిన్ రోడ్డు మీదుగా బ్యాండ్ మేళతాళాలు, నృత్యాలు చేసుకుంటూ ఉల్లాసంగా సాగింది. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి నృత్యాలు చేస్తూ జోష్ నింపారు.

శంషాబాద్ రూరల్ : అంబేడ్కర్ జయంతి వేడుకలు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో . పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. సుల్తాన్‌పల్లిలో మాజీ సర్పంచ్ దండుఇస్తారి, మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో కౌన్సిలర్ పారేపల్లి లావణ్యశ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆదిభట్ల : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్,ఆదిబట్ల, చింతపల్లి గూడ గేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు, పూలమాలలు వేసి ఘణంగా నివాళ్లు అర్పించారు.


ఆమనగల్లులో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో కసిరెడ్డి


యాచారంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి


మాడ్గులలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు


కందుకూరు: అంబేడ్కర్ జయంతి వేడుకల్లో నాయకులు


కొత్తూర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు


కడ్తాల్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో జడ్పీటీసీ, తదితరులు


మంచాల : నివాళులర్పిస్తున్న పార్టీల నేతలు


షాబాద్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకుల


షాద్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు..


కేశంపేట : కేక్ కట్ చేస్తున్న జడ్పీటీసీ


శంషాబాద్‌లో..


నందిగామలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్

యాచారం, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల కుప్పగా మార్చిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం యాచారం, గున్‌గల్ గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. రూ.500కే వంట గ్యాస్ అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. త్వరలో డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ఫార్మాసిటీని రద్దు చేశామని, అక్కడ పార్మాకళాశాలలతో పాటు మెగాటౌన్ షిప్ ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్, బుచ్చిరెడ్డి, అమృతసాగర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 14 : దేశంలో బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా అన్నారు. బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఆదివారం ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్దలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి ఆయూష్మాన్ భారత్ కింద రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. పాలమూరు ఎంపీగా డీకే అరుణ విజయం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, శ్రావన్ కుమార్, మహేష్, ఉదయ్ కుమార్ బాబు ఉన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, ఏప్రిల్ 14 : తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జూలపల్లి ఎంపీటీసీ సునిత భర్త సుదర్శన్‌రెడ్డి రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుదర్శన్‌రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో జడ్పీటీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహేమాన్, మల్లేశ్, వెంకటయ్య, యాదయ్య, ఉన్నారు.

ఇప్పలిపల్లి విద్యార్థికి నవోదయ సీటు

కేశంపేట, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని ఇప్పలిపల్లి గ్రామానికి చెందిన బేరి శివరాజ్ కుమారుడు బేరి శశిరాజ్ శనివారం ప్రకటించిన నవోదయ ఫలితాల్లో సీటు సాధించాడు. ఆదివారం ఆ విద్యార్థిని మాజీ సర్పంచ్ తోట ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్ సత్కరించారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


ఆమనగల్లు : పడిపూజలో భక్తులు

ఆమనగల్లు, ఏప్రిల్ 14 : పట్టణంలోని అయ్యప్ప కొండపై గల శ్రీహరిహరపుత్ర దేవాలయంలో అయ్యప్ప జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన పడిపూజలో అయ్యప్ప మాలధారులు, భక్తులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితీ వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే గురుస్వామి పడిపూజ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బందోని మైసమ్మ ఉత్సవాలు

కొత్తూర్ : మున్సిపాలిటీలోని పెంజర్ల రోడ్డులో గల శ్రీబందోని మైసమ్మ దేవాలయంలో వార్షిక ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉత్సవాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మలిపెద్ది విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మండలకేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో గిరీష్‌నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తుమ్మల నర్సింలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజి ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఎంపీటీసీలు కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి కాంగ్రెస్



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి.

కొందుర్గు, ఏప్రిల్ 14 : భారతదేశంలోని అన్ని మతాలకు సమానత్వం ఉండాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహా ఫంక్షన్ హాల్‌లో కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన చేస్తున్నదని, మూడోసారి మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని ఆరోపించారు. బీజేపి అభ్యర్థి డీకె అరుణకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని, ఆ విషయాన్ని మరిచిపోయి ఆమె మాట్లాడుతున్నారని అన్నారు. కార్యకర్తలు 28 రోజులు కష్టపడి తనను గెలిపిస్తే, 5 సంవత్సరాల పాటు వారికి సేవ చేస్తానని చెప్పారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకబడిన కొందుర్గు మండలానికి ప్రాధాన్యత ఇచ్చి, మండలాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా గెలిపిస్తే, పార్లమెంట్‌లో పాలమూరు వాణిని వినిపిస్తారన్నారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు మిథున్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై చేరికలు


చేవెళ్ల : కాంగ్రెస్‌లో చేరుతున్న రాంచంద్రయ్యగౌడ్, తదితరులు

చేవెళ్ల, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం పట్లోళ్ల కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో రావులపల్లి మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ యాదవ్ వారి అనుచరులతో కలిసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూర్ మల్లేష్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం భీంభరత్ సమక్షంలో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మైపాల్, నర్సింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలను మోసగించిన బీజేపీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సతీష్ మాదిగ

కడ్తాల్, ఏప్రిల్ 14 : కేంద్రంలో పదేళ్ళు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసగించిందని తెలంగాణ మాదిగ దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవని సతీష్‌మాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేపట్టడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. కడ్తాల మండలంలో ఆదివారం లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్త శుద్ధి లేదని మండిపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఎస్సీ వర్గీకరణ చేపడుతుందని సతీష్ మాదిగ చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీశైలం, అర్జున్, రమేశ్,శివరాజు, శ్రీనివాస్ యాదవ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

కడ్తాల్, ఏప్రిల్ 14 : అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని 12, 13వ వార్డుల్లో సామాజిక వర్గాల వారికి శుభకార్యాల నిమిత్తం రూ.పదిహేను వేల విలువ చేసే వంట పాత్రలను గూడూరు శ్రీనివాస్ రెడ్డి సమకూర్చారు. ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మీయ్య, కందటికంటి యాదయ్యగౌడ్, మంకిశ్రీను, వెంకటరమణ, మహేశ్,శ్రీశైలం, శ్రీకాంత్,కృష్ణ, నాగార్జున, నర్సింహ్మా, శ్రీను, పాపమ్మ, పద్మమ్మ, ఈదమ్మ తదితరులు ఉన్నారు.

దాతలు ముందుకు రావాలి

కడ్తాల్ , ఏప్రిల్ 14 : వేసవిలో ప్రజల దాహార్తి, ఆకలి బాధలు తీర్చేందుకు చలివేంద్రాలు, అంబలి కేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి కోరారు. కడ్తాల మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్, గంప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రజలకు అంబలిపంపిణీ చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చేవెళ్ల, ఏప్రిల్ 14 : రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, హాజరు కావాలన్నారు.

క్రైం కార్నర్

అవిన్య సంఫీ ఫాంహౌజ్‌లో మద్యం స్వాధీనం

● నలుగురి అరెస్టు



మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ పోలీసులు

శంషాబాద్, ఏప్రిల్ 14 : శంషాబాద్ మున్సిపాలిటీ శివారులోని అవిన్య సంఫీ ఫామ్స్ ఫాంహౌజ్‌లో ఆదివారం ఎక్సైజ్ సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతి లేని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ సిబ్బంది కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవిన్య సంఫీ ఫామ్స్ ఫాంహౌజ్‌లో జరుగనున్న ఓ పార్టీలో అనుమతిలేకుండా మద్యం సరఫరా అవుతుందని ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. సిబ్బంది తనిఖీలు చేపట్టగా పన్ను కట్టని 22 మద్యం సీసాలను అక్కడ గుర్తించారు. లీటరు బాటిళ్లతో పాటు పన్ను చెల్లించిన మద్యం సీసాలు లభించాయి. ఆ మద్యం బాటిళ్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫాంహౌజ్‌కు నిర్వాహకులు రిషబ్‌జ్యోతి, దేబేస్, ప్రేమ్‌సింగ్, నరసింహులను అరెస్టు చేశారు. దాడుల్లో శంషాబాద్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ గండ్ర దేవేందర్‌రావు, ఎస్సై హరికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి టాటా ఏస్ బోల్తా

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 14 : అదుపు తప్పి ఓ టాటా ఏస్ ఆటో బోల్తా పడటంతో నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళుతున్న టాటా ఏస్ ఆటో తొండుపల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. నడిరోడ్డుపై పడడంతో దాన్ని పక్కకు తీయడానికి గంటకు పైగా సమయం పట్టడంతో శంషాబాద్ నుంచి తొండుపల్లి ఫ్లై ఓవర్ జాం అయింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాన్ని క్రేన్ సహాయంలో పక్కకు తీయడంతో రాకపోకలు కొనసాగాయి. ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ నరేందర్‌రెడ్డి చెప్పారు.

నేడు శివపార్వతుల కల్యాణం


కందుకూరు: సిద్ధమైన శివాలయం

షాబాద్ : షాబాద్ మండల పరిధిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో నేడు శివపార్వతుల కల్యాణం, నేటి నుంచి 18వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శ్రీరామ నవమికి సిద్ధమైన ఆలయాలు

కందుకూరు : ఈ నెల 17న నిర్వహించబోయే శ్రీరామ నవమి వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాలను భక్తులు సిద్ధం చేస్తున్నారు. ఆలయాల గోడలకు కలర్లను వేస్తున్నారు. పలు గ్రామాల్లోని దేవాలయాలను ఆదివారం నుంచే కల్యాణ మహోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు.

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచెడ్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణం ఏర్పాట్ల కోసం ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్వాహకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. కల్యాణానికి సంబంధించి రూపొందించి పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, నిర్వాహకులు చిదంబర శర్మ, దత్తు శర్మ, శిరీష్‌కుమార్, నాయకులు బాలకృష్ణ, లింగం, సాయికుమార్,రంగయ్య, తదితరులు ఉన్నారు.